www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

శనివారం 8, ఆగస్టు, 2026 8 పేజీలు

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలులో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలకం




జిల్లా కలెక్టర్ అంకిత్

8లో

# ఆర్ఎంపీల హైడోస్!



- అర్హతలేని వైద్యం.. ప్రాణ సంకటం!
- ఆసుపత్రులను తలపించేలక్లినిక్ నిర్వహణ?
- జ్వరాల సీజన్లో ఆర్ఎంపి లతో జాగ్రత్త
- ఆర్ఎంపీలపై భద్రాద్రి న్యూస్ ప్రత్యేక కథనం..







2వ పేజీలో...

చంద్రుగొండ ప్రతినిధి , ఆగస్టు 7( భద్రాద్రి న్యూస్): ఇవాల్టికి మూడు రోజులయ్యింది... దగ్గు,జ్వరం తగ్గుతనే లేదు మా కొడుకు తెచ్చిన గోలీలను వేసుకుంటున్న ఏం తేడా కనబడటం లేదు.ఇక రేపు కొత్తగూడెం కానీ చంద్రుగొండ కానీ దావఖానాలో చూపించకుంట అంటున్న నరసయ్య దగ్గుకుంటూ చెబుతుండగానే... అరే నరసన్న కొత్తగూడెం దాకా ఎందుకు మనోళ్లే డాక్టర్లే రెండు సూదులు గుచ్చితే చాలు నీ దగ్గు నీ జరం అన్ని పోతాయి. పో అని రమేష్ చెప్పాడు. నరసయ్య ఊర్లో ఆర్ఎంపీ దగ్గర ట్రీట్మెంట్ తీసుకున్నాడు. రమేష్ చెప్పినట్లే రెండు రోజుల్లో నరసయ్య దగ్గు, జ్వరం వంటి నొప్పులు అన్ని తగ్గిపోయాయి.ఇది ఎలా సాధ్యమని కాస్త చదువుకున్న నరసయ్య కొడుకు ఆరా తీస్తే ఆర్ఎంపి ఇచ్చినవి అధిక డోసు మందులు పేషెంట్ కు భవిష్యత్తులో ఇబ్బంది ఎదురవుతుందని తెలిసినా... ఇలా చాలామంది అర్హత లేని ఆర్ఎంపీలు యాంటీబయటిక్, స్టెరాయిడ్స్ ఇస్తున్నారు. ఇవేవీ తెలియని వారి వైద్యాన్ని గుడ్డిగా నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

---

### జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను

## అత్యంత ప్రామాణికంగా రూపొందించాలి

- జనగణన సంచాలకులు భారతి హోలీ కేరి
- డేటా నాణ్యత, ఖచ్చితత్వం, ఏకరూపతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్ణీత గడువులోపు ధృవీకరించిన జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను రాష్ట్ర కార్యాలయానికి పంపాలి

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 7 (భద్రాద్రిన్యూస్ ):** జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ)ను అత్యంత ప్రామాణికంగా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించాలని జనగణన సంచాలకులు (డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్) భారతి హోలీ కేరి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె దృశ్యమాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు.



8లో

# ఓబిసి రిజర్వేషన్ల ప్రదాత బిందేశ్వర ప్రసాద్ మండల్ యాదవ్

## – బిపి మండల్ యాదవ్ కు నివాళులర్పించిన మల్లి బాబు యాదవ్





**కామేపల్లి,ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):**

భారతదేశ చరిత్రలో ఓబీసీలకు ఆగస్టు 7వ తారీకు ఒక సువర్ణ అధ్యాయానికి నాంది పలికిందని, దానికి స్ఫూర్తి ప్రదాత బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ అని,ఆ మహనీయుని వల్లనే ఓబీసీల తలరాతలు మారడం జరిగిందని,డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ అభివర్ణించారు. మండల్ రిజర్వేషన్ డే సందర్భంగా కామేపల్లి మండలం లోని పండితాపురం లో శుక్రవారం బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ చిత్రపటానికి మల్లి బాబు యాదవ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 7వ తారీకు ను సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని,దీనికి ప్రధాన వ్యక్తి బిందేశ్వర్ ప్రసాద్ యాదవ్ కోట్లాది వెనుకబడిన వర్గాల జీవితాలలో వెలుగు నింపిన మహా నాయకుడు అని,తన జీవితమంతా రాజకీయ అధికారం కోసం కాకుండా ఓ బి సి,ఎస్ సి ఎస్ టి వర్గాల కు సమాన అవకాశాలు కల్పించాలని పోరాటం చేసిన మహాయోధుడని, ఆ పోరాటానికి ఫలితంగా 1990 ఆగస్టు 7వ తారీఖున నాటి ప్రధాని విపి సింగ్ హయాంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని,ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఎంపీగా,కేంద్ర మంత్రిగా పనిచేసినప్పటికీ నిత్యం బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాడి రిజర్వేషన్లు సాధించారు. అంతకుముందు ఏ నాయకుడు చేయని విధంగా దేశమంతటా పర్యటించి బడుగు బలహీన వర్గాల స్థితిగతులను గమనించి దేశంలో 52 శాతం పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్రానికి నివేదిక ఇవ్వడం జరిగిందని, ఒక వ్యక్తి తన కోసం కాకుండా సమాజం కోసం బ్రతికారని, అలాంటి బీపీ మండల్ యాదవ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్,కొమ్మి నేపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ఓబీసీ జిల్లా నాయకులు చల్ల మల్లయ్య,మండల కాంగ్రెస్ నాయకులు షేక్ రబ్బానీ పాషా, శీలం పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, గుగులోతు రవి, జక్కంపూడి వెంకటేశ్వర్లు,బండి ఉపేందర్, ధరావత్ హరిచంద్ర,మేకల లక్ష్మీనారాయణ, భూక్య వీరన్న, బానోతు లక్ష్మ, దేరంగుల తిరపయ్య, రామారావు, తురక బిక్షం,చల్ల చిన్న మల్లయ్య, పగిడిపల్లి రాములు, మొగిలి శ్రీను పాల్గొన్నారు.

# ఆప్కారి శాఖ తీరుపై అడ్వకేట్ బోడా వినయ్ కుమార్ తీవ్ర ఆరోపణలు

**బెల్ట్ షాపులపై కానరాని తనిఖీలు -- మద్యం సిండికేట్‌పై మౌనమేల?**

**మామూళ్ల మత్తే కారణమా అని ప్రశ్నించిన అడ్వకేట్ బోడా వినయ్ కుమార్**

**కారేపల్లి. ఆగస్టు 7(భద్రాద్రి న్యూస్ ):**

కారేపల్లి మండలంలో ఆప్కారి శాఖ అధికారుల పనితీరుపై అడ్వకేట్ బోడా వినయ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహించడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ ధరలకు విరుద్ధంగా ప్రతి మద్యం బాటిల్‌పై రూ.15 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆయన అన్నారు. మండలంలో కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం విక్రయాలను నియంత్రిస్తున్నారని, అయినప్పటికీ ఆప్కారి శాఖ అధికారులు మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోందని బోడా వినయ్ కుమార్ పేర్కొన్నారు. కొంతమంది ఆప్కారి శాఖ అధికారులకు మద్యం సిండికేట్ నిర్వాహకుల నుంచి ప్రతినెలా మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయని, అందుకే బెల్ట్ షాపులు, అధిక ధరల విక్రయాలపై చర్యలు తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఎంఆర్పీకి మించి ధరలు వసూలు చేస్తున్న వారిపై, అలాగే అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ బోడా వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. అలాగే, ఈ ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన కోరారు.



# పోగొట్టుకున్న 17 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించిన ఇన్స్పెక్టర్ కరుణాకర్

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 7( భద్రాద్రిన్యూస్ ):–**

ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన సుమారు 17 మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోలీసులు విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. వన్ టౌన్ సిబ్బంది, ఐటి కోర్ టీం సమన్వయంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఈ ఫోన్లను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారని,రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశామని తెలిపారు. తమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. నేటి ఆధునిక కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీలకు కీలకమైన వనరు అని ఇన్స్పెక్టర్ అన్నారు.



# జైల్ బరో కార్యక్రమానికి జయప్రదం చేయండి

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి వినతిపత్రం అందించిన ఆశా వర్కర్లు**

**సిఐటియు యూనియన్ జిల్లా నాయకురాలు పి.రమ్య మండల కన్వీనర్ బాదావత్ శ్రీను నాయక్ కార్యకర్తలకు పిలుపు**




**కామేపల్లి,ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):**

మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శాఖ అధికారికి వినతి పత్రం అందిస్తూ సీఐటీయూ యూనియన్ మండల కన్వీనర్ బాధావత్ శీను నాయక్ ఈ సందర్భంగా శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కామేపల్లి మండలం ఏజెన్సీ పరిసర ప్రాంతమైన 24 గ్రామపంచాయతీలలో పనిచేస్తున్నటువంటి ఆశా వర్కర్లు కామేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్య అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈనె10వ తేదీన జరగబోయే జైల్ బరో కార్యక్రమంలో మేము సైతం అంటూ అందరం కలిసిమెలిసి మా సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు. అందరూ భాగస్వామ్యం ఆఐ పాల్గొంటున్నామని ముందస్తు వారు వైద్య అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు పి రమ్య మండల సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శ్రీను ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కోర్ర నీల.రేఖ.ఏ విజయ. ఘుమ్మి.రాంబాయి అనిత.విజయ. కమలమ్మ.పద్మ తదితరులు పాల్గొన్నారు

# పి ఆర్ సి సాధించేవరకు దశల వారి పోరాటం కొనసాగిస్తాం

**ఉపాధ్యాయ సంఘాల నేత వెంకటేశ్వర్లు వెల్లడి**




**కామేపల్లి,ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):–**

ఉపాధ్యాయులకు పిఆర్సి ప్రకటించే వరకు దశల వారి పోరాటాలు కొనసాగిస్తామని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నేత జి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని కొమ్మినేపల్లి హైస్కూల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. భోజనం విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిఆర్సి సాధన, పెండింగ్ డీఏ ల కొరకు జీవో 25 సవరణ,సిపిఎస్ రద్దు లాంటి డిమాండ్ల సాధన కోసం దశలవారి పోరాటాలు కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి రవికుమార్,వీరభద్రం వి ఎస్ రెడ్డి,టీ కైలాస రావు,ఎస్.కె రంజాన్,హెచ్ఎం పి జ్యోతి,భవాని, కవిత,అరుణ, జ్యోతి,రమ ప్రభ, విజయ కుమారి, ఉష తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి న్యూస్
శనివారం 8, ఆగస్టు, 2026

# ఆంధ్రాలో విలీనం చేసిన ఐదు పంచాయతీలను తెలంగాణకు అప్పగించాలి

**– శ్రీ రాముడు ఇక్కడ భూములు అక్కడ**
**– పోలవరంతో భద్రాద్రి కి పెనుముప్పు**
**– సీతారామ సీతమ్మధార ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు సాగునీళ్ళు ఇవ్వాలి**
**– ఇసుక లారీల వల్ల దెబ్బ తిన్న రోడ్డును బాగు చేయాలి**
**– ఎస్.కే. సాబీర్ పాషా**






**భద్రాచలం/చర్ల, ఆగస్టు 7 (భద్రాద్రిన్యూస్ ):**
–రాష్ట్ర విభజన సమయంలో అశాస్త్రీయంగా ఆంధ్రాలో కలిపిన 5 గ్రామపంచాయ తీలను తెలంగాణ తిరిగి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెండవ రోజు యాత్ర శుక్రవారం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక లో ప్రారంభమై భద్రాచలం మీదుగా దుమ్ముగూడెం చర్ల మండలాలను కలుపుకొని చర్ల మండల పరిధిలోని తిప్పాపురం గ్రామంలో ముగిసింది. ఈ ప్రజా చైతన్య యాత్రకు భద్రాచలం దుమ్ముగూడెం చర్ల మండలాలలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా నాయకులకు పూలమాలలు వేసి హారతులు పట్టి ఆహ్వానం పలికారు. భద్రాచలం పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు తూర్పాక గ్రామంలో జయరామరెడ్డి స్మారక స్థూపానికి నరసాపురం గ్రామంలో రావులపల్లి నాగభూషణం స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎర్రజెండాలతో దారి పొడవున సాగిన మోటార్ సైకిల్ ర్యాలీలు పాదయాత్రలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దారి పొడవునా అరుణ ప్రతాకాలను నాయకులు ఎగరవేశారు. ప్రజానాట్యమండలి ఆటపాట ఉత్సాహాన్ని కలిగించింది.

ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ భాష మాట్లాడుతూ ప్రజల హక్కులు, అస్తిత్వం, గిరిజనుల భవిష్యత్తును కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పాషా స్పష్టం చేశారు.

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఉండగా, దేవస్థానానికి చెందిన భూములు, ఆస్తులు ఆంధ్రప్రదేశ్‌లో ఉండడం చారిత్రకంగా, పరిపాలనా పరంగా, ఆధ్యాత్మికంగా సమంజసం కాదన్నారు. "రాముడు ఇక్కడ... భూములు అక్కడ" అనే విరుద్ధ పరిస్థితికి కేంద్ర, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ముగింపు పలకాలని కోరారు. సీతారామ, సీతమ్మదార ప్రాజెక్టులను ద్వారా జిల్లాకు సమృద్ధిగా సాగునీరు అందించి అ తర్వాత తరలించుకు పోవాలని చెప్పారు.

అలాగే ఎన్నో ఏళ్లుగా నిరీక్షణలో ఉన్న ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకానికి వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. పోలవరం ప్రాజెక్టు భద్రాద్రి జిల్లా మనుగడకే పెను సవాలుగా మారిందని పాషా ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాక్‌వాటర్ ప్రభావంతో గిరిజన గ్రామాలు, వ్యవసాయ భూములు, అడవులు, జీవనాధారాలు ప్రమాదంలో పడుతున్నాయని పేర్కొన్నారు. భద్రాద్రి ప్రజల ఆస్తులు, ప్రాణాలు, హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతి వర్షాకాలంలో గోదావరి వరదలు భద్రాచలం పట్టణంతో పాటు అనేక గ్రామాలకు శాపంగా మారుతున్నాయని, అయినప్పటికీ శాశ్వత పరిష్కారంపై పాలకులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. గోదావరి వరద ముంపు నుంచి ప్రజలను రక్షించేందుకు నదీ తీరంలో శాస్త్రీయ ప్రమాణాలతో బలమైన కరకట్టలు నిర్మించి శాశ్వత వరద నియంత్రణ ప్రణాళికను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ ఖాళీల భర్తీపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని స్పెషాలిటీల్లో వైద్యులను వెంటనే నియమించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు.

తరతరాలుగా సాగు చేస్తున్న గిరిజన రైతులకు పోడు భూములపై పెండింగ్ హక్కు పట్టాలు వెంటనే ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక లారీల కారణంగా వాజేడు నుండి భద్రాచలం వరకు ఉన్న ప్రధాన రహదారి అద్వాన్నంగా తయారైందని కాంట్రాక్టర్లు కోట్ల రూపాయలు సంపాదించుకుంటూ ఏజెన్సీ రహదారులను సర్వనాశనం చేస్తున్నారని వెంటనే రహదారికి మరమ్మత్తులు చేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములు, సహజ వనరులు, రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొంటూ, ఏజెన్సీ ప్రాంత పరిరక్షణ కోసం సీపీఐ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని పాషా స్పష్టం చేశారు.

మువ్వా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రారంభమైన రెండవ రోజు చైతన్య యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కల్లూరు వెంకటేశ్వరరావు, మేయర్ మూడు గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, అడ్డగర్ల తాతాజీ ఉప్పుశెట్టి రాహుల్, ఎస్ కే ఫహిం, ఎస్వీఎస్ నాయుడు పేరాల శ్రీనివాస్, మారేడి శివాజీ కిలిమి ఎల్లారెడ్డి, బొల్లోజు వేణు, రత్నకుమారి, నూపా పోతయ్య నూపా తిరుపతిరావు పాల్వంచ రామారావు సాధన పల్లి సతీష్ కంభం మెట్టు శ్రీనివాస్ వామన రావు కోడి రెక్కల రాజారావు కోటి ముత్యాలరావు తాటిపూడి రమేష్, అమరవాది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అవయవ దానం మహాదానం.. విద్యార్థుల్లో చైతన్యం నింపిన అవగాహన కార్యక్రమం




**పాల్వంచ, ఆగస్టు 7( భద్రాద్రి న్యూస్):**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), పాల్వంచలో తెలంగాణ స్టేట్ ఆర్గన్ అండ్ బాడీ డోనర్స్ అసోసియేషన్, హైదరాబాద్ సహకారంతో భాగ్య క్లబ్ ఆధ్వర్యంలో "అవయవ దానం -- మహాదానం" అనే అంశంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథి శ్రీ జి. గురు ప్రకాష్ అవయవ, శరీర దానం యొక్క ప్రాముఖ్యత, చట్టపరమైన అంశాలు, సమాజానికి కలిగే ప్రయోజనాలను వివరించి విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీ టి. హరిలాల్, భాగ్య క్లబ్ కోఆర్డినేటర్ డా. ఎన్. శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డా. జె. మాధవి మాట్లాడుతూ అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించి, మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవయవ దానంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సమాజంలో సానుకూల సందేశాన్ని వ్యాప్తి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# గ్రామీణ పేదల ఉపాధికి గండి

**జైల్‌భరోను విజయవంతం చేయాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు పిలుపు**



కారేపల్లి, ఆగస్టు 7(భద్రాద్రి న్యూస్ ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు దూరమవుతున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. ఈ నెల 10న కార్మిక, కర్షక, రైతు, ఉద్యోగి, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శు క్రవారం కారేపల్లిలో ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, రైతాంగానికి నష్టం కలిగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలు చేపడుతోందని ఆరోపించారు. కార్మికులకు రక్షణ కల్పిస్తున్న చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చి వారి హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే చర్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్‌భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, పేదల ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రచార కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కే. నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కేసగాని ఉపేందర్, మండల కార్యదర్శి ఎనమనగండ్ల రవి, ముండ్ల ఏకాంబరం, పాసిని నాగేశ్వరరావు, నాగమణి, కమల, రాధ, హుస్సేన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కారేపల్లి పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి.. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు: ఎస్ఐ బి. గోపి**

**కారేపల్లి, ఆగస్టు 7 భద్రాద్రి న్యూస్ :**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

తనిఖీల్లో భాగంగా ఎస్ఐ బి. గోపి, బ్లూ కోర్ట్ ఓంకార్, హోంగార్డ్ మల్లేష్ వాహనదారులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని వారు హెచ్చరించారు.అలాగే మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని,



ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# పోలీస్ ఉద్యోగాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కోచింగ్ ప్రారంభం



**పాల్వంచ, ఆగస్టు 7( భద్రాద్రి న్యూస్):**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), పాల్వంచలో పోలీస్ సబ్–ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న డిగ్రీ విద్యార్థుల కోసం టి.జె.ఎల్.ఎస్.ఎస్. (శ్రీ తోకల జగన్నాధం––లక్ష్మమ్మ సేవా సమితి), పాల్వంచ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ ప్రారంభించారు.

ముఖ్య అతిథి టి.జి.ఎస్.పి.ఎఫ్., కె.టి.పి.ఎస్. యూనిట్ డి.ఎస్.పీ. ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో శారీరక సాధనతో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, అర్థమెటిక్, మెంటల్ ఎబిలిటీ వంటి అంశాల్లో పట్టు సాధిస్తే పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులభమవుతుందని విద్యార్థులకు సూచించారు.

ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులకు ఉచిత కోచింగ్ మెటీరియల్, పోలీస్ నియామక పరీక్షల మోడల్ ప్రశ్నాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోకల రామదాసు, డాక్టర్ టి. అరుణ కుమారి, కోటగిరి రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ పొట్లపువ్వ శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ తులసి విజయ్ ప్రసాద్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి రూ.75 వేల వైద్య సహాయం

**ఎంపీ ఎల్ఓసీ అందజేత.. కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావు చొరవ**

**సింగరేణి, ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):**

సింగరేణి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన సూరపాక కృష్ణ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయన కుటుంబానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి రూ.75 వేల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేశారు. ఈ ఎల్ఓసీని కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఇటీవల జరిగిన ప్రమాదంలో సూరపాక కృష్ణ చేతికి తీవ్ర గాయాలు కావడంతో అత్యవసర శస్త్రచికిత్స అవసరమైంది. కుటుంబం నిరుపేద కావడంతో చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి పరిస్థితిని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

మల్లెల నాగేశ్వరరావు విజ్ఞప్తికి స్పందించిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్‌తో మాట్లాడి రూ.75 వేల విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించారు. అనంతరం ఆ



ఎల్ఓసీని మల్లెల నాగేశ్వరరావు స్వయంగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి, చికిత్సకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకరిస్తామని భరోసా ఇచ్చారు.

ఆపద సమయంలో తమకు అండగా నిలిచి వైద్య సహాయం అందేలా కృషి చేసిన కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావుకు, తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం మంజూరు చేసిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# అంబరాన్నంటిన బోనాల సంబరాలు..

**శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా బోనాల పండుగ..**





**పాల్వంచ, ఆగస్టు7( భద్రాద్రి న్యూస్):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో బోనాల పండుగ అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాణి మిరియాల అమ్మవారికి బోనం సమర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు బోనం విశిష్టతను గురించి వివరించారు తెలంగాణలో బోనాల పండుగ కొన్ని సంవత్సరాల నుండి అంగరంగ వైభవంగా జరుగుతుందని అన్నారు. కొత్తగూడెం జోన్ ఏజీఎం వీరన్న మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బోనం అనేది భక్తికి కృతజ్ఞతలకు గ్రామ దేవతల పై ఉండే అపారమైన విశ్వాసానికి ప్రతిగానే అన్నారు. పోచమ్మ మైసమ్మ ఎల్లమ్మ దేవతకు భక్తుతో ప్రేమతో సమర్పించే నైవేద్యం బోనమని విద్యార్థులకు వివరించారు. పాఠశాలలోనే విద్యార్థులు బోనాలు ఎత్తుకొని సాంప్రదాయ బద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించారు వివిధ వేషధారణలో అందరినీ అలరించారు. బోనాల పాటకు అందరూ అలరించి డాన్సులు వేశారు. కార్యక్రమంలో ప్రైమరీ ఇన్చార్జ్ మహమ్మద్ సిరాజ్ బేగం, అధ్యాపకులు శిరీష, చందన, భవాని, భావన, శ్రావణి, పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# వైరా మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా పనిచేస్తా - డాక్టర్ కాపా చంద్రకళ

**ఆరవ వార్డులో అభివృద్ధి పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**

**వైరా, ఆగస్టు 7, (భద్రాద్రి న్యూస్)**

వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఆరవ వార్డులో శుక్రవారం సమస్యలను పరిశీలిస్తూ అడిగి తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మురళీకృష్ణ ఈ సందర్భంగ చంద్రకళ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్థానిక వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో వైరా మున్సిపాలిటీ అభివృద్ధి పనులు సరవేగంగా కొనసాగుతున్నాయి అని, ఆరవ వార్డులోని మున్సిపల్ నిధులతో చేపడుతున్న సుమారు రూ. ఒక కోటి వ్యయంతో నిర్మిస్తున్న సైడ్ డ్రైనేజీ పనులకు కొలతలు తీసుకున్నారు. 20 వార్డుల్లో కూడా 20 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని, అందులో భాగంగా ప్రతి వార్డులో డ్రైనేజీ వ్యవస్థ రోడ్లకు ఎస్టిమేషన్ జరగబోతున్నాయని, వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడమే ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, పారుపల్లి కృష్ణారావు, లగడపాటి ప్రభాకర్ రావు, తోటకూర శ్రీకాంత్, గౌరవరపు జగదీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు





భద్రాద్రి న్యూస్

శనివారం 8, ఆగస్టు, 2026

# తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్,





**సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్**

**నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలి- ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

**ఆ దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలందరికీ నిండుగా ఉండాలి - పువ్వాళ్ళ దుర్గాప్రసాద్**

**వైరా, ఆగస్టు 7, (భద్రాద్రి న్యూస్ ):-**

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రామదాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు కుటుంబ సమేతంగా తిరుపతి తిరుమల దేవస్థానాన్ని కాలినడకన చేరుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి లలిత, కుమార్తెలు గాయత్రి, చందనలతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తన సతీమణి శ్రీమతి ఇందుమతి తో కలిసి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో మరింత అభివృద్ధి సాధించాలని రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు సుభిక్షంగా జీవించాలని రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లా సహకారంతో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే వైరా నియోజకవర్గ ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం మరింత సేవ చేసే శక్తి అవకాశాన్ని ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నామని, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజల ఆశీర్వాదాల, సహకారంతో వైరా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం అంకితభావంతో కృషి చేస్తామని తెలిపారు.

# ఆర్టీసీ లో ప్రమాదాల నివారణకు డ్రైవర్ లకు శిక్షణ





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 7 (భద్రాద్రి న్యూస్):**

ఆర్టీసీలో ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు శిక్షణ తరగతులను ఖమ్మం రీజినల్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్త బస్టాండ్ వద్ద నిర్వహించారు. ఖమ్మం రీజనల్ మేనేజర్ ఏ. సరిరామ్ ఆద్వర్యంలో ఖమ్మం రీజియన్ పరిదిలోని 7 డిపోలలోని డ్రైవరు సోదరులకు ప్రమాదాల నివారణపై శిక్షణా తరగతులను ఖమ్మం కొత్త బస్టాండ్ నందు గల మీటింగ్ హాల్ లో నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి రీజనల్ మేనేజర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, డ్రైవింగ్ చేసే టప్పుడు డ్రైవరు ఎలా అప్రమత్తత తో విధులు నిర్వహించాలో వివరిచడం జరిగినది. అలాగే మంచి ఆహారపు అలవాట్లను అలవరచుకొని, సరియైన విశ్రాంతి తీసుకుంటూ విధులను నిర్వహించాలని, ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యల గురించి వివరించడం జరిగినది. అనంతరం పోలీస్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ గారు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని, ప్రమాదాల నివారణలో డ్రైవర్ ల పాత్ర చాలా కీలకమని అందుకని ప్రతి ఒక్కరూ ప్రమాదాలు జరగకుండా విధులను నిర్వహించాలని సూచించారు. తదనంతరం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధు గారు మాట్లాడుతూ ప్రమాదాల నివారణ కోసం ఆర్టీసీ నిర్వహిస్తున్న ఇలాంటి శిక్షణా తరగతుల వలన, ప్రమాదాల నివారణకు ఆర్టీసీ తీసుకుంటున్న చర్యల వలన మన రాష్ట్రం లోనే కాకుండా దేశం లోనే ప్రమాదాల నివారణలో మన ఆర్టీసీ నెంబర్ వన్ స్థానంలో ఉందని, ఇందులో మన ఆర్టీసీ డ్రైవరు సోదరుల పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. ఇకముందు కూడా మన ఖమ్మం రీజియన్ లో ప్రమాదాలు జరగకుండా మన డ్రైవరు సోదరులు మంచి అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

# ఓబిసి రిజర్వేషన్ల ప్రదాత బిందేశ్వర ప్రసాద్ మండల్ యాదవ్



**బిపి మండల్ యాదవ్ కు నివాళు లర్పించిన మల్లి బాబు యాదవ్**

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 7 (భద్రాద్రిన్యూస్):**

భారతదేశ చరిత్రలో ఓబీసీలకు ఆగస్టు 7వ తారీకు ఒక సువర్ణ అధ్యాయానికి నాంది పలికిందని, దానికి స్ఫూర్తి ప్రదాత బిందెశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ అని, ఆ మహనీయుని వల్లనే ఓబీసీల తలరాతలు మారడం జరిగిందని, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ అభివర్ణించారు. మండల్ రిజర్వేషన్ డే సందర్భంగా కామేపల్లి మండలం పండితాపురం లో బిందెశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ చిత్రపటానికి మల్లి బాబు యాదవ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 7వ తారీకు ను సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, దీనికి ప్రధాన వ్యక్తి బిందెశ్వర్ ప్రసాద్ యాదవ్ కోట్లాది వెనుకబడిన వర్గాల జీవితాలలో వెలుగు నింపిన మహా నాయకుడు అని, తన జీవితమంతా రాజకీయ అధికారం కోసం కాకుండా ఓ బి సి,ఎస్ సి ఎస్ టి వర్గాల కు సమాన అవకాశాలు కల్పించాలని పోరాటం చేసిన మహాయోధుడని, ఆ పోరాటానికి ఫలితంగా 1990 ఆగస్టు 7వ తారీఖున నాటి ప్రధాని విపి సింగ్ హయాంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని, ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఎంపీగా,కేంద్ర మంత్రిగా పనిచేసినప్పటికీ నిత్యం బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాడి రిజర్వేషన్లు సాధించారు. అంతకుముందు ఏ నాయకుడు చేయని విధంగా దేశమంతటా పర్యటించి బడుగు బలహీన వర్గాల స్థితిగతులను గమనించి దేశంలో 52 శాతం పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్రానికి నివేదిక ఇవ్వడం జరిగిందని, ఒక వ్యక్తి తన కోసం కాకుండా సమాజం కోసం బ్రతికారని, అలాంటి బీపీ మండల్ యాదవ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, కొమ్మి నేపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ఓబీసీ జిల్లా నాయకులు చల్ల మల్లయ్య, మండల కాంగ్రెస్ నాయకులు షేక్ రబ్బానీ పాషా, శీలం పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, గుగులోతు రవి, జక్కంపూడి వెంకటేశ్వర్లు, బండి ఉపేందర్, ధరావత్ హరిచంద్ర, మేకల లక్ష్మీనారాయణ, భూక్య వీరన్న, బానోతు లక్ష్మ, దేరంగుల తిరపయ్య, రామారావు, తురక బిక్షం, చల్ల చిన్న మల్లయ్య, పగిడిపల్లి రాములు, మొగిలి శ్రీను మరియు తదితరులు పాల్గొన్నారు

# గంజాయి తాగుతున్న ఐదుగురు అరెస్ట్: ఇన్స్పెక్టర్ బాలకృష్ణ



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 7( భద్రాద్రిన్యూస్ ):**

గంజాయి తాగుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.

ఖమ్మం పట్టణం కు చెందిన 1) యిటిగల సాయి గణేష్, 2) రెంటల ధనుష్ కుమార్,3) ఎం.డి అరీఫ్

అహ్మద్, 4) పోగుల సిద్ధూ, సూర్యాపేట కు చెందిన 5) బత్తుల ఉదయ కిరణ్ అనే వ్యక్తులు గురువారం సాయంత్రం ఖమ్మం బై పాస్ రోడ్ లో ఒక హోటల్ పక్కన ఖాళీ స్థలంలో ఐదుగురు స్నేహితులు కలిసి గంజాయి తాగుటకు గంజాయి పొట్లాలతో ఉన్న యువకులు పోలీస్ వాహనాన్ని చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, వారు గత కొంత కాలంగా గంజాయి తాగుతున్నట్లు ఒప్పుకోగా వారి వద్ద నుండి 250 గ్రాముల గంజాయి ధర రు.15,000/- నగదు,నాలుగు సెల్ ఫోన్ లు స్వాధీన పర్చుకొని, వారిని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్ నిమిత్తం ఖమ్మం కోర్ట్ కు తరలించినట్లు తెలిపారు.

భద్రాద్రి న్యూస్
శనివారం 8, ఆగస్టు, 2026

# లాల్‌దర్వాజ బోనాలను తలపించిన త్రివేణి పాఠశాల బోనాల సంబరాలు







**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 7( భద్రాద్రిన్యూస్ ):**

తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన వేడుకలు చిన్నపాటి లాల్‌దర్వాజ బోనాల జాతరను తలపించాయి. బ్లూ, గ్రీన్, రెడ్, ఎల్లో హౌస్‌ల ఆధ్వర్యంలో నాలుగు బోనాలను సిద్ధం చేయగా, ప్రైమరీ, ఫౌండేషన్, ఇగ్నైట్, ఐఐటీ ఇంపాక్ట్ విభాగాల విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని పాల్గొన్నారు. పోతరాజుల వేషధారణలు, డప్పుల వాయిద్యాలు, జానపద నృత్యాలు, రంగం (భవిష్యవాణి) ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విద్యార్థులు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో



సమర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డా. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని, ప్రపంచ స్థాయి విద్యతో పాటు భారతీయ విలువలను విద్యార్థులు అలవరచుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం త్రివేణి టాలెంట్ స్కూల్స్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సీఆర్వో కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థుల్లో నాటేందుకు పాఠశాల చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రుల మరియు స్థానికుల ప్రశంసలు అందుకుంది.

# వినోదాల హరివిల్లు.. సంతోషాల పెవిలియన్





**ఖమ్మంలో వైభవంగా 'బటర్ ఫ్లై' ఎగ్జిబిషన్**
**ప్రవేశ రుసుము కేవలం రూ. 50లు**
**వచ్చే వారం నుంచి పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రవేశ పాసులు!**
**'ఎగ్జిబిషన్' ఈనెల 7 నుంచి ఆగస్టు 30వ వరకు**
**ఎగ్జిబిషన్ ముఖ్య నిర్వాహకులు గరిమెళ్ల జానకిరామయ్య**

ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 7 (భద్రాద్రిన్యూస్ ) :-ఆందోళనలు, ఒత్తిళ్లతో నిండిన దైనందిన జీవితంలో కాసేపు మనసును తేలికపరిచి, చిరునవ్వుల ఊయలలూగించేందుకు ఖమ్మం నగరం ఒక వర్ణరంజిత వేదికగా మారింది. చిన్నారుల కేరింతలు, పెద్దల ఆనంద భాష్పాలతో హృదయాలను ఆహ్లాదపరిచే వినోదాల హరివిల్లు బటర్ ఫ్లై ఎగ్జిబిషన్ ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో రూపుదిద్దుకుంది. ఎస్.కె ట్రేడ్ ఫెయిర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'బటర్ ఫ్లై ఎగ్జిబిషన్' ఈనెల 7 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు నగరవాసులకు అపరిమిత ఆనందాన్ని పంచడానికి సిద్ధమైంది. ఖమ్మం నగరంలో పెవిలియన్ గ్రౌండ్ బటర్ ఫ్లై ఎగ్జిబిషన్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్య నిర్వాహకులు గరిమెళ్ల జానకిరామయ్య మాట్లాడుతూ... ఈ ఎగ్జిబిషన్ కేవలం ఆటపాటల ప్రదర్శన మాత్రమే కాదు, బాధ్యతల భారంతో అలసిపోయిన మనసులకు ఆనందాన్ని, కొత్త ఉత్సాహాన్ని అందించే ఒక హృదయపూర్వకమైన వేదిక అవుతుందన్నారు. ప్రతి ఒక్కరి బంధాలను మరింత బలపరిచేలా, ఆహ్లాదకర వాతావరణంలో అమూల్యమైన జ్ఞాపకాలను అందిస్తుందన్నారు. సకుటుంబ సమేతంగా గడిపే ప్రతి మధురక్షణం మనిషి ఆయుష్షును కూడా పెంచుతుందన్నారు. ఆత్మీయుల కలయిక, పసిపిల్లల నవ్వులు మానసిక ప్రశాంతతను అందించి ఆరోగ్యానికి కొత్త ఊపిరి పోస్తాయన్నారు. పిల్లల ముఖాల్లో విరిసే నవ్వులే ఈ సమాజానికి అసలైన అందం అన్నారు. చిన్నారుల ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు గొప్ప ఆకర్షనీయంగా నిలుస్తాయన్నారు. వచ్చే వారం నుంచి 14 ఏళ్ల లోపు విద్యార్థులకు ఉచిత ఎంట్రీ పాసుల సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా స్వయంగా ఆయా పాఠశాలల గుమ్మాల వద్దకు వెళ్లి విద్యార్థులకు ఉచిత ప్రవేశ పాసులను అందజేసి, చిన్నారుల హృదయాల్లో ఆనందాల వెలుగులు నింపనున్నామన్నారు. ఆర్థికభారం కాకుండా సామాన్యుడికి కూడా పూర్తిస్థాయి వినోదం అందాలనే ఉద్దేశంతో, ప్రవేశ రుసుమును కేవలం రూ. 50 లుగా నిర్ణయించామన్నారు. ఈ ప్రదర్శనలో సరికొత్తగా ఏర్పాటుచేసిన 'రోబోటిక్ బటర్ ఫ్లై' పరికరం ప్రతి ఒక్కరినీ విస్మయానికి గురిచేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందన్నారు. దీంతో పాటు సందర్శకులను మంత్రముగ్ధులను చేసే 12 అద్భుతమైన విభాగాలు అలరించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, సలాంబో, కొలంబస్, తోరా.. తోరా, కుటుంబ సమేత వినోదాలు : డ్రాగన్ ట్రైన్, మహారాజా ట్రైన్,

**చిన్నారుల ప్రత్యేక ఆకర్షణలు :** వాటర్ బోట్, కార్లు, జంపింగ్, గుర్రాలు, బౌన్సర్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖమ్మం నగర ప్రజలు కుటుంబ సమేతంగా ఈ ఎగ్జిబిషన్ ను సందర్శించి ఆహ్లాదాన్ని ఆస్వాదించాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అనుబంధ నిర్వాహకులు మొలుగూరి నాగేందర్, శిరీష, షేక్ జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# పాలడుగు గ్రామంలో రీ-సర్వే వరం... భూ రికార్డులకు శాశ్వత భరోసా





**వైరా, ఆగస్టు 7, (భద్రాద్రి న్యూస్)**

వైరా నియోజకవర్గ మండల పాలడుగు గ్రామపంచాయతీ ఆఫీస్ లో శుక్రవారం భూ -రికార్డులకు రీ - సర్వే వరం శాశ్వత శాశ్వత భరోసా కార్యక్రమం పాలడుగు గ్రామ సర్పంచి గద్దల నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి వైరా మండల తాసిల్దార్ ఎం. సురేష్ బాబు ఆ సరే కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి నైజాం, బ్రిటిష్ పాలనుంచి నేటిదాకా కాలక్రమేనా మార్పు వస్తుంది. కావున సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది, చెందుతూ ఉంది కావున రైతులు ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని భూముల హద్దులను సాంఘిక పరిజ్ఞానంతో భూముల రీ -సర్వేను కచ్చితంగా ఎలాంటి అవకత అవక తవకలు లేకుండా రికార్డుల్లో పారదర్శకత తో వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ముక్యంగరైతులు ఈ సదా అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలడుగు గ్రామ సర్పంచి గద్దర్ నరసింహారావు, గ్రామపంచాయతీ సెక్రెటరీ కిరణ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది వార్డ్ మెంబర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలులో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలకం

**ప్రతి మండలం రెండు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రాధాన్యత అంశాలుగా ఎంపిక చేయాలి**

**ప్రాధాన్యత అంశాలకు అనుగుణంగా కనీసం 25 శాతం ప్రాజెక్టు ఆధారిత కార్యకలాపాలు చేపట్టాలి**

**జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక , మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కార్యాచరణ సమావేశం లో జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 7( భద్రాద్రిన్యూస్ ):-**

2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక , మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతమైన సాధనమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనలో జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు .

భారత ప్రభుత్వం నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ప్రతి మండలం రెండు లక్ష్యాలను ప్రాధాన్యత అంశాలుగా ఎంపిక చేసి, ఆయా లక్ష్యాలకు సంబంధించిన కనీసం 25 శాతం ప్రాజెక్టు ఆధారిత కార్యకలాపాలను మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో తప్పనిసరిగా పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. ఎంపిక చేసిన లక్ష్యాలు గ్రామాల అవసరాలు, స్థానిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడేలా ఉండాలని సూచించారు.

మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంపీడీవోలు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన గణాంకాలు, భౌతిక, ఆర్థిక ప్రగతి, అవసరాల వివరాలను సకాలంలో అందించి ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని ఆదేశించారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల, ఆరోగ్యవంతమైన గ్రామాలు, బాలలకు అనుకూల వాతావరణం, నాణ్యమైన విద్య, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, సుపరిపాలన, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ వనరుల పెంపు కోసం గ్రామీణ పర్యాటకం, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, పౌల్ట్రీ, పశుసంవర్ధక అభివృద్ధి, సేంద్రీయ వ్యవసాయం, గ్రామ ఉత్పత్తుల జియో ట్యాగింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆదాయ వృద్ధి కార్యక్రమాలు వంటి ప్రాజెక్టులను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు.

అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమ శాఖల పథకాలు, నిధులు, వనరులను సమీకరిస్తూ ఫండ్ కన్వర్జెన్స్ ద్వారా గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని తెలిపారు.

ప్రతి ప్రాజెక్టుకు లక్ష్యం, అంచనా వ్యయం, నిధుల వనరు, అమలు చేసే శాఖ, కాలపట్టిక, ఆశించిన ఫలితాలను స్పష్టంగా తెలుపుతూ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రూపొందించే ప్రణాళికలు గ్రామాల సమగ్రాభివృద్ధికి దోహదపడటంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆదర్శంగా నిలవాలని అన్నారు.

ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని, శాఖల మధ్య సమన్వయంతో నాణ్యమైన జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా ప్రణాళిక అధికారి సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను అత్యంత ప్రామాణికంగా రూపొందించాలి







మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా జనగణన సంచాలకులు భారతి హోళీ కేరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ప్రతి జిల్లాకు ప్రత్యేక జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందిస్తున్నామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లకు ప్రత్యేక హ్యాండ్‌బుక్‌లు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌లో జనాభా, సామాజిక, ఆర్థిక, పరిపాలనా, మౌలిక వసతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తామని తెలిపారు. భవిష్యత్ ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, పరిశోధనలు, జనగణన విశ్లేషణలకు ఈ హ్యాండ్‌బుక్ ప్రామాణిక ఆధార పత్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ప్రతి శాఖ నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించి, రెవెన్యూ గ్రామం, పట్టణ స్థాయి వరకు పూర్తి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. 2025 డిసెంబర్ 31 నాటికి అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, సౌకర్యాలు, శాఖల అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. గృహాల జాబితా సేకరణ అనంతరం జనాభా గణాంకాలను జాతీయ స్థాయిలో విశ్లేషించి అధికారికంగా ప్రచురిస్తారని తెలిపారు.

జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచే ప్రతి సమాచారం సంబంధిత శాఖల అధికారిక నమోదుల ఆధారంగా మాత్రమే ఉండాలని, సమాచారం సంపూర్ణంగా, ఖచ్చితంగా, ఏకరూపంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఆగస్టు 10 నుంచి 21 వరకు సమాచార సేకరణ చేపట్టాలని, జిల్లా స్థాయిలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రతి శాఖకు బాధ్యతలు కేటాయించాలని ఆదేశించారు. శాఖల వారీగా నోడల్ అధికారులను నియమించి, అవసరమైన నమూనా పట్టికలను ముందుగానే అందించాలని సూచించారు. అన్ని శాఖలు ఒకే నిర్ధారిత తేదీని ప్రామాణికంగా తీసుకొని సమాచారాన్ని అందించాలని, అధికారికంగా ధృవీకరించిన సమాచారాన్ని మాత్రమే ఉపయోగించాలని, అన్ని శాఖల్లో గణాంకాల ఏకరూపత పాటించాలని ఆదేశించారు.

ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 8 వరకు సమాచార నమోదు, పరస్పర పరిశీలన చేపట్టాలని సూచించారు. ప్రతి పట్టికను సంబంధిత శాఖాధికారి, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ విభాగం రెండుసార్లు పరిశీలించాలని తెలిపారు. ప్రతికూల విలువలు, ఖాళీ గడులు, పునరావృత నమోదులు లేకుండా చూసి, మొత్తాలు, ఉపమొత్తాలు సరిగా ఉన్నాయో లేదో ధృవీకరించాలని సూచించారు. గత జనగణన గణాంకాలు, ప్రస్తుత శాఖల సమాచారాన్ని పోల్చి అసాధారణ వ్యత్యాసాలు ఉంటే వాటికి కారణాలు నమోదు చేయాలని తెలిపారు. నిర్దేశించిన నమూనా పట్టికలను మాత్రమే ఉపయోగించాలని, టైపింగ్ పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని, పదాల అక్షరక్రమంలో ఏకరూపత పాటించాలని సూచించారు. గ్రామాల పేర్లు అధికారిక రెవెన్యూ నమోదుల ప్రకారమే నమోదు చేయాలని, సంకేత సంఖ్యల్లో ఎలాంటి మార్పులు చేయరాదని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 8లోపు జిల్లా సమగ్ర పరిచయాన్ని సిద్ధం చేయాలని తెలిపారు. ఇందులో జిల్లా పరిచయం, భౌగోళిక స్వరూపం, పరిపాలనా నిర్మాణం, ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక పరిస్థితులు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, అభివృద్ధి సూచికలు, జిల్లాకు సంబంధించిన ప్రత్యేక విశేషాలను పొందుపరచాలని సూచించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు సమాచార ధృవీకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పట్టికలో అన్ని గడులు పూర్తిగా నింపబడ్డాయా, మొత్తాలు సరిగా ఉన్నాయా, శాఖల మధ్య గణాంకాల్లో వ్యత్యాసాలున్నాయా, వివరణాత్మక సమాచారం గణాంకాలకు అనుగుణంగా ఉందా, తేదీలు సక్రమంగా నమోదయ్యాయా, అధికారిక ఉత్తర్వుల ఆధారంగానే వివరాలు నమోదు చేశారా, పటాల అనుసంధానం సక్రమంగా ఉందా అనే అంశాలను బాధ్యతాధికారులు తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ప్రతి సమాచారం ప్రామాణికత, ఖచ్చితత్వం, తాజాదనం, సంపూర్ణత, ఏకరూపత అనే ఐదు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. ప్రతి దశ పూర్తయిన తర్వాత అంతర్గత నాణ్యత తనిఖీ నిర్వహించి, ప్రతి సవరణకు సంబంధించిన ఆధార పత్రాలను భద్రపరచాలని తెలిపారు. అన్ని అభ్యంతరాలను పరిష్కరించి, బాధ్యతాధికారి ధృవీకరణ అనంతరం మాత్రమే జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ పార్ట్--ఎను నిర్ణీత గడువులో రాష్ట్ర జనగణన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జనగణన సంచాలకులు ఇచ్చిన మార్గదర్శకాలను జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. సంబంధిత శాఖల నుంచి నిర్ణీత నమూనాలో సమాచారాన్ని సేకరించి, పూర్తిస్థాయిలో పరిశీలన, ధృవీకరణ అనంతరం జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌కు సంబంధించిన వివరాలను నిర్ణీత కాలపట్టిక ప్రకారం రాష్ట్ర జనగణన కార్యాలయానికి రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపిస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పి సీఈవో నాగలక్ష్మి, ప్రణాళికాధికారి సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.